వికలాంగులకు నిత్యావసర వస్తువుల అందజేత

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక శ్రావణి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.శ్రావణి, డాక్టర్ దీపక్ చక్రవర్తిల ఆర్థిక సాయంతో శనివారం అమలాపురంలో వికలాంగులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. కోనసీమ వికలాంగుల సంక్షేమ సేవాసంఘం గౌరవ అధ్యక్షులు వంటెద్దు వెంకన్న నాయుడు ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు నాగారపు పరశురాముడు, ఆసుపత్రి సిబ్బంది చేతుల మీదుగా 15 మంది వికలాంగులకు రూ.వెయ్యి విలువచేసే నిత్యవసర వస్తువుల కిట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది భవాని, వాణి, కిషోర్, శ్రీను, అమలాపురం స్థానిక వడ్డెగూడెం 17వ వార్డు కౌన్సిలర్ డి.రాము, బొర్రా మాచరయ్య, తిరికోటి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అందజేస్తున్న శ్రావణి ఆసుపత్రి సిబ్బంది

అన్నదాత సుఖీభవ అందేదెన్నడో..!

- ఏడాదిలో ఇప్పటి వరకూ దక్కని ప్రభుత్వ భరోసా
- ఏటా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ
- పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపు
- ఇప్పటికే రైతులకు పీఎం కిసాన్ సాయం

వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతు

ప్రజాశక్తి- రాజోలు

అన్నదాత సుఖీభవ పథకం అందేదెన్నడోనని రైతులు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ రైతుభరోసా పథకానికి పేరు మార్చడం మినహా ఎటువంటి పురోగతి లేకపోవడం రైతుల్లో నిరుత్సాహం వ్యక్తమవుతోంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా లో 1,58,129 ఎకరాల్లో 95,645 మంది రైతులు వరి సాగు చేపట్టారు.ఇందులో పీఎం కిసాన్ పథకానికి 1,22,279 మంది అర్హత పొందారు. కొత్త ప్రభుత్వం రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్చారు. ప్రభుత్వ వెబ్ సైట్‌లోనూ మార్పులు చేశారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తామని సిఎం చంద్రబాబు 'సూపర్ సిక్స్'లో ప్రకటించారు. ఈపథకం అమలుకు రైతులు ఎదురు చూస్తు న్నారు.

పట్టించుకోని కూటమి సర్కారు

ఆరుగాలం శ్రమిస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస భరోసా రైతుకు అందడం లేదు.. ఒకపక్క ప్రకృతి వైపరీత్యాలు నష్టాలు తెస్తుంటే, మరోవైపు ఇచ్చిన హామీలను కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పంట సాయం అందిస్తామన్న చంద్రబాబు ఇప్పుడా ఊసెత్తడం లేదు. అన్నదాతను ఆదుకుంటామన్న మాట నీటిమూటగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి 5నెలలు పూర్తయినా అన్నదాత సుఖీభవ పథకంపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికే పంట పెట్టుబడి పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి కంటనీరు రప్పిస్తుంది.

పెరిగిన ఖర్చు.. అందని సాయం

జిల్లాలోని 22 మండలాల్లో 2024-25 ఖరీఫ్ కు సంబంధించి 1,58,129 ఎకరాల్లో 95,645 మంది రైతులు వరి సాగు చేపట్టారు.ఇందులో పీఎం కిసాన్ పథకానికి 1,22,279 మంది అర్హత పొందారు. ఈ ఏడాది జూన్ 18న రూ.2 వేల చొప్పున రూ.24.46 కోట్లు ఇవ్వగా, రెండో విడతగా అక్టోబర్ లో రూ.22.45 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అందించాల్సిన సాయంపై నోరుమెదపడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలను సత్వరమే అందించాలని రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు. వరి పంటకు మద్దతు ధర పెరగకపోగా, పెట్టుబడి మాత్రం ప్రతి సీజన్లోనూ అధికమవుతోంది. ప్రస్తుత ప్రభుత్వం అనాలోచిత వైఖరితో వరి రైతులకు సాగు కష్టమవుతుంది.

ఖరీఫ్ ముగిసింది

రైతులకు, కౌలు రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి హామీ ఇచ్చి ంది. అంతకుముందు టిడిపి ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీల్లో ఈ అం శాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. వైసిపి సర్కారు 'వైఎస్ఆర్ రైతు భరోసా' పేరిట స్కీంను అమలు చేయగా కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' అని పేరు పెట్టింది. కాగా ఇప్పటి వరకు దీనిపై విధి విధానాలు ఖరారు చేయలేదు. రబీలోనైనా ఇస్తారా అని రైతులు చూస్తున్నారు. ప్రాధాన్యతాక్రమంలో పథకాలు అమలు చేయాలని నిర్ణయించారని, ఆ మేరకు వచ్చే ఖరీఫ్‌కు ముందు పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని చెబుతుతున్నారు. అదే జరిగితే ఒక ఏడాది సాయం రైతులు, కౌలు రైతులు కోల్పోతారు.

జిల్లాలో సాగు వివరాలు

- ఖరీఫ్ విస్తీర్ణం - 1.58 లక్షల ఎకరాలు
- వరి సాగు రైతులు - 95,645
- పీఎం కిసాన్ లబ్ధిదారులు - 1,22,279
- రైతు భరోసా కేంద్రాలు - 515

సుఖీభవ పథకాన్ని అమలు చేయాలి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలి. అర్హులైన రైతు లందరి ఖాతాలో రూ.20 వేలు జమ చేసి వారిని ఆదు కోవాలి. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయి తీవ్ర ఇబ్బం దులు పడు తున్నాం. ఇప్పుడు సాయం అందక అవస్థలు ఎదుర్కొంటున్నాం.

- బుంగ సత్యనారాయణ, కౌలు రైతు, బి.సావరం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నదాత సుఖీభవ పథకంపై చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సాయం రెండో విడత సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తదుపరి కార్యచరణ చేసిన వెంటనే అర్హులకు అన్నదాత సుఖీభవ పథకం సాయం వారి ఖాతాల్లో జమ అవుతుంది.

- ఓలేటి బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి, అమలాపురం

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు రూ.20 వేల ఇస్తామన్నారు. ఇప్పటివరకు రూ.20వేలు కాదు కదా 20 పైసలు కూడా సాయం చేయలేదు. వెంటనే ప్రభుత్వం సుఖీభవ పథకంద్వారా ప్రతి రైతును, కౌలు రైతులను ఆదుకోవాలి.

- పీతల రామచంద్రరావు,కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి

అమలాపురంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి టి. నిషాంతి, పాల్గొన్న ట్రాన్స్‌కో సిబ్బంది

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీని ప్రారంభించిన జెసి

ప్రజాశక్తి - అమలాపురం

విద్యుత్ పొదుపుగా వినియోగిస్తూ, భావితరాలకు ఇంధన వనరులపై భరోసాను కల్పించాలని జెసి టి.నిషాంతి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్ట రేట్ నుండి గడియారపు స్తంభం వరకు నిర్వహించిన ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీని జెసి కలెక్టరేట్ నందు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ట్రాన్స్‌కో, సిబ్బంది ఇంధనాన్ని ప్రతి ఒక్కరూ పొదుపు చేయాలనే నినాదాలతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే భావితరాలకు సహజ వనరులను అందించేందుకు ప్రతి ఒక్కరు సమిష్టిగా ఇంధన పొదుపును ఆచరించాలన్నారు. నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరికి ఇంధన పొదుపు పట్ల అవగాహన ఎంతైనా అవసరమని తెలిపారు. ఇంధన సంరక్షణ సామర్థ్యాలు, ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ప్రతి ఏడాది ఇంధన పొదుపుకై వివిధ అంశాల పై కార్యక్రమా లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంధన వాడకం నిత్యకృత్యంగా వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగపడు తున్నదన్నారు. మూడు నక్షత్రాలు నుంచి ఐదు నక్షత్రాలు రేటింగ్ కలిగిన విద్యుత్ గహోపకరణాలు వినియోగించడం ద్వారా 30 శాతం విద్యుత్తును ఆదా చేయవచ్చునని ఆమె తెలిపారు. ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి డిసెంబర్ 14న ప్రతి ఏడాది జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవంగా నిర్వహిస్తారన్నారు. భారత ప్రభుత్వ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఇంధన పొదుపు చట్టాన్ని తీసుకురావడమే కాకుండా, ప్రతి సంవత్సరం జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తున్నదన్నారు. ట్రాన్స్కో ఎస్ఇ ఎస్ రాజబాబు ప్రసంగిస్తూ ఇబ్బడి ముబ్బడి ఇంధన వనరుల వినియోగం భవిష్య అవసరాలను ప్రశ్నార్థకం చేస్తోందని, ఈనేపథ్యంలో ఇంధన వనరుల రక్షణ ప్రతిఒక్కరి బాధ్యతగా మారిందన్నారు. జనాభా పెరుగుదలతో పాటే పెట్రోలు, డీజిల్, గ్యాసు, విద్యుత్ వంటి ఇంధన వనరుల వినియోగం విపరీతంగా పెరుగుతోందన్నారు. ఒక రకంగా ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేసే పారిశ్రామిక రంగ ప్రగతిని నిర్దేశించేవే ఇంధన వనరులన్నారు. అందుకే అభివృద్ధి చెందుతున్న దేశంగా మన దేశంలో ఇంధన వనరుల వినియోగం ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగిందన్నారు. ఫలితంగా సంప్రదాయ ఇంధన వనరులు హరించుకు పోతున్నాయని, ఇలాంటి ఇంధన వనరులను రక్షించుకోవడమే నేడు ప్రధాన కర్తవ్యంగా మారిందన్నారు. ఇంధన పేదరికాన్ని అంతంచేసే దిశగా పునరుత్పాదక ఇంధన వనరులు, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటు లో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిలు రవికుమార్, పుల్లయ్య, ఎఇ రవి కుమార్ ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం

చొప్పెల్ల నీటిసంఘం ఛైర్మన్ గోపాలస్వామి, సభ్యులకు అభినందనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా నీటి సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. **ఆలమూరు:** మండల పరిధిలోని నాలుగు నీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. మడికి నీటి సంఘం ఎలక్షన్ నిమిత్తం 12 టిసిల్లో మొత్తం 2376 మంది ఓటర్లు ఉండగా 12 మంది సభ్యులు ఏకగ్రీవం కాగా అధ్యక్షునిగా చెల్లబోయిన వెంకట శివ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే చొప్పెల్ల నీటి సంఘం ఎలక్షన్ నిమిత్తం 12 టిసిల్లో మొత్తం 3989 మంది ఓటర్లు ఉండగా 12 మంది సభ్యులు ఏకగ్రీవంగా కాగా అధ్యక్షునిగా మెర్ల గోపాలస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలమూరు నీటి సంఘం ఎలక్షన్ నిమిత్తం 12 టిసిల్లో మొత్తం 2549 మంది ఓటర్లు ఉండగా 12 మంది సభ్యులు ఏకగ్రీవం కాగా అధ్యక్షులుగా వైట్ల గంగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చింతలూరు నీటి సంఘం ఎలక్షన్ నిమిత్తం 12 టిసి లలో మొత్తం 3309 మంది ఓటర్లు ఉండగా 12 మంది సభ్యులు ఏకగ్రీవం కాగా అధ్యక్షులుగా గారపాటి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో వీరందరికీ ఎన్నికల అధికారులైన తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, ఎంపిడిఒ ఎ.రాజు, రావులపాలెం మండల పరిషత్ ఎఒ మంగతాయారు, రావులపాలెం వ్యవసాయ అధికారి బి.మీనా, ఇరిగేషన్ ఎఇ కృష్ణ త్రిమూర్తులు, మండల పరిషత్ ఎఇ మెహర్ ప్రకాష్, తదితరులు ఆయా పోలింగ్ కేంద్రాలలో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** మండలంలో నీటిపారుదల వినియోగదారుల సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని వద్దిపర్రు, ఆత్రేయపురం, అంకంపాలెం, మెర్లపాలెం గ్రామాలలో నీటి సంఘం ఎన్నికలు జరిగాయి. నీటి సంఘాల చైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వద్దిపర్రు ఛైర్మన్‌గా జుజ్జవరపు శ్రీహరి, ఆత్రేయపురం తోటకూర సత్తిరాజు, అంకంపాలెం కరటూరు నరసింహారావు, మెర్లపాలెం కల్లూరి పుత్ర సాయి సాయిరాం ఛైర్మన్‌లుగా ప్రమాణస్వీకారం చేశారు. **రాజోలు:** మండల పరిధిలోని ఐదు నీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. రాజోలు నీటి సంఘం అధ్యక్షునిగా పినిశెట్టి వెంకట స్వామి(బుజ్జి), తాటిపాక నీటి సంఘం అధ్యక్షునిగా కడలి కృష్ణ మోహన్, కడలి నీటి సంఘ అధ్యక్షునిగా గాలిదేవర వెంకన్న బాబు, పొన్నమండ నీటి సంఘం అధ్యక్షునిగా గుబ్బల శ్రీనివాస్, పొదలాడ నీటి సంఘం అధ్యక్షునిగా ఉలిశెట్టి లక్ష్మణరావులు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. వీరందరికీ ఎలక్షన్ అధికారులైన తహశీల్దార్ ఎన్ఎస్ఎన్. ప్రసాద్, ఎంపిడిఒ రాంబాబు, ఆయా పోలింగ్ కేంద్రాలలో ధ్రువీకరణ పత్రాలు అందజేసి అభినందించారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **కాట్రేనికోన:** మండలంలోని చెయ్యేరు నీటి సంఘం అధ్యక్షులుగా ఎనమదల సత్యబాలాజీ, చిన్నగాడవల్లి నీటి సంఘం అధ్యక్షులుగా బండారు ఏసు, కాట్రేనికోన నీటి సంఘం అధ్యక్షులుగా వాసంశెట్టి రాజేశ్వరరావు, దొంతుకురు నీటి సంఘం అధ్యక్షులుగా పెన్నమరాజు రంగరాజు, కందికుప్ప నీటి సంఘం అధ్యక్షులుగా ఆకాశం శ్రీనివాస్, పల్లంకూరు నీటి సంఘం అధ్యక్షులుగా ఇసుక పట్ల వెంకటరమణలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తహశీల్దార్ సునీల్ కుమార్ తెలిపారు. అమలాపురం రెవెన్యూ డివిజన్ అధికారిని మాధవి చెయ్యరు, కాట్రేనికోన జడ్‌పి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. **ఉప్పలగుప్తం:** మండలంలోని ఎనిమిది సాగునీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి.ఉప్పలగుప్తం నీటి సంఘ అధ్యక్షునిగా మోటూరి రవిశంకర్ కుమార్, చల్లపల్లి దంగేటి వెంకటరెడ్డి నాయుడు(చిట్టిబాబు), ఎన్.కొత్తపల్లి గుత్తుల శ్రీనివాస్(డాక్టర్ శ్రీను), కిత్తన చెరువు బండారు వెంకటేశ్వరరావు(వెంకన్న బాబు), గొల్లవిల్లి నల్లా సత్యనారాయణ మూర్తి, గోపవరం ఆకుల వెంకటరమణ, ఎస్.యానం పోలిశెట్టి వెంకట ఉమామహేశ్వరరావు, చినగాడవిల్లి బండారు జగపతి రాజారావుఋఃఅ సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎ న్నికల ప్రక్రియను తహశీల్దార్ విఎస్.దివాకర్ పర్యవేక్షించగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సిహెచ్.రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. **కపిలేశ్వరపురం:** ఐదు నీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలేరు నీటి సంఘ అధ్యక్షునిగా గుణ్ణం సత్యనారాయణమూర్తి , ఉపాధ్యక్షునిగా గుత్తుల పుత్రయ్య, అంగర నీటి సంఘం అధ్యక్షునిగా కొమ్మిశెట్టి నాగ సూరిబాబు, ఉపాధ్యక్షునిగా చోడే గోవిందరాజు, వల్లూరు నీటి సంఘం అధ్యక్షులుగా కాకర్ల శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షునిగా సలుమూరి సింహాచలం, తాతపూడి నీటి సంఘం అధ్యక్షులుగా మేక శివప్రసాద్, ఉపాధ్యక్షులుగా చుండ్రు భవ్య , మాచర నీటి సంఘం అధ్యక్షునిగా కొరపాటి జానకి రామయ్య ఉపాధ్యక్షులుగా సలాది సీతారాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరందరికీ ఎలక్షన్ అధికారులైన తహశీల్దార్ పి.చిన్నారావు, తదితరులు ఆయా పోలింగ్ కేంద్రాలలో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. **కొత్తపేట:** కొత్తపేట నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షునిగా బండారు వీర రాఘవులు (వీరబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాల నందు జరిగిన నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారి మాధవరపు వెంకట రామారావు పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలలో 12 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తదనంతరం జరిగిన అధ్యక్ష ఉపాధ్యక్ష ఎన్నికలలో అధ్యక్షునిగా బండారు వీరబాబు. ఉపాధ్యక్షులుగా చోడే రామకృష్ణ లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నీటి సంఘం అధ్యక్షునిగా బండారు వీరబాబు వరుసగా మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్ని కావడంతో హ్యాట్రిక్ సాధించారు. విజేతలనువీరిని కొత్తపేట మండల పార్టీ అధ్యక్షులు కంఠంశెట్టి శ్రీనివాస్ ముత్యాల బాబ్జి బూసి జయలక్ష్మి భాస్కరరావు పల్లి ఏసు, యల్లమెల్లి జగన్మోహన్ గుబ్బల మూర్తి తదితరులు అభినందించారు. **ముమ్మిడివరం:** మండలంలో ముమ్మిడివరం నీటి సంఘం అధ్యక్షుడిగా సరిపల్లి శ్రీనివాస రాజు ఉపాధ్యక్షుడిగా బొబ్బిలి ఈశ్వరరావులు, అనాతవరం నీటి సంఘం అధ్యక్షుడిగా శీలం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పి పద్మనాభం ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. **మండపేట:** మండలంలో గల పాలతోడు, ఏడిద, కేశవరం, మండపేట నీటిసంఘాలు ఏకగ్రీవమయ్యాయి. పాలతోడు నీటిసంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బొబ్బిలి నాగేశ్వరరావు, యేలేటి వెంకటరావు, ఏడిద నీటిసంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కోలుపాటి సత్యనారాయణ మూర్తి (బాబు), ముత్యాల పట్టాభిరామయ్య, కేశవరం నీటిసంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా అనబాక శ్రీనివాసర్రావు, పురంశెట్టి శ్రీనివాస్, మండపేట నీటిసంఘ అధ్యక్షులుగా పసల శ్రీనివ్వాఉలు ఎన్నికయ్యారు.

కాట్రేనికోన జడ్‌పి హైస్కూల్లో ఎన్నికల ప్రక్రియ పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ఉప్పలగుప్తంలో ఎన్నికల ప్రక్రియ పరిశీలిస్తున్న తహశీల్దార్ దివాకర్

నీటి సంఘం ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులు విజయం

సఖినేటిపల్లి : మండలం నీటి సంఘం ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులు విజయం సాధించారు. ఈ సందర్భంగా విజయం సాధించిన కమిడి రాజీవ్ భూషణ్, గొల్ల మందల కిన్ను, ఇంజేటి స్వామి దాస్‌లను శనివారం మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సన్మానించారు. విజేతలకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అలాగే పలువురు వైసిపి నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజేతలను సత్కరించారు.

కాలేరు నీటి సంఘం నూతన పాలక వర్గానికి నాయకుల అభినందన

రాజోలు నీటిసంఘం అధ్యక్షుడు పి.బుజ్జికి ధ్రువీకరణ పత్రం అందజేత

కొత్తపేట నీటి సంఘం నూతన పాలకవర్గానికి పలువురి అభినందన


ఎన్నికైన ఏడిద నూతన నీటిసంఘం

కార్టూ'నిజం'



'ఉపాధి' గ్రామ సభలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని పడమర ఖండ్రిక గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. ఎస్ ఆర్ పి ఈ కనకారావు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిఆర్‌పి వి.సువర్ణరాజు గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో సేకరించిన పనుల వివరాల చదివి వినిపించారు. ఉపాధి హామీ చట్టంలో జాబ్ కార్డు దారులు ప్రభుత్వం నిబంధనల ప్రకారం రెండు పూటల పని చేయాలని ఎపిఒ రవికిరణ్ ఉపాధి కూలీలకు సూచించారు. ఈ గ్రామ సభలో ఎంపిటిసి సభ్యురాలు పి.శేషారత్నం, ఎన్ఆర్ఇజిఎస్ జెఇ పి.రజిత్ సింగ్, టెక్నికల్ అసిస్టెంట్లు జె.లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ సునీత వీరమణి, ఉపాధి కూలీలు, మేట్లు, తదితరులు పాల్గొన్నారు.

పనుల వివరాలను చదువుతున్న డిఆర్‌పి సువర్ణరాజు

'అమరజీవి' సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - అమలాపురం

అమరజీ పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య అన్నారు. అమలాపురం స్థానిక విష్ణు శ్రీ గ్రాండ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైన శ్రీరాములు మహాత్మా గాంధీ ఆశయాలకొరకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. సమైక్య భారతి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నల్లా పవన్ కుమార్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు నేడు తెలుగు రాష్ట్రంతో పాటు భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటుకు మూలకారకుడని అన్నారు. ఆదివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్ లో అమరజీవి పొట్టి శ్రీరాములు 72 వర్ధంతి కార్యక్రమాలు సమైక్య భారతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంగీత దర్శకులు సాలూరు వాసురావు, గురజాడ అప్పారావు ముని మనవడు ఎం.విజయ్ గోపాల్, మానసిక వైద్య నిపుణులు జి.గంగరాజు, హిందీ శాఖధిపతి నల్లా సత్య నారాయణ, గిడుగు రామ్మూర్తి ముని మనవడు గిడుగు నాగేశ్వరరావు వంటి ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - అమలాపురం

సినీ నటులు వెంకటేష్, రాణా పుట్టినరోజు వేడుకలను శనివారం అధ్యక్షుడు జివి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమలాపురంలోని లూయి అంధుల పాఠశాల నందు చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి, అనంతరం వారికి స్వీట్స్ ఫ్రూట్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో రాయుడు వెంకటేష్, కుసుమ వెంకటేష్, జిల్లెలు నాగబాబు, కొల్లేటి శ్రీను, రవి కిరణ్ , కుడుపూడి శీను, రామకృష్ణ, టౌన్ అభిమానులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి - రావులపాలెం

ఎన్‌టిఆర్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ బండారు సత్యా నంద రావు అన్నారు. స్థానిక ప్రగతి నర్సింగ్ హోమ్‌లో శనివారం వైద్యులు కర్రి బల రామరెడ్డి, కర్రి సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వైద్య సేవలను ఎంఎల్‌ఎ బండారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం చంద్రబాబు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎన్‌టిఆర్ వైద్య సేవలను మరింత విస్తృతం చేసేందుకు, పేదలకు అందుబాటులో ఉండేం దుకు కార్యా చరణ రూపొందించారని అన్నారు. ప్రజలు ఎన్‌టిఆర్ వైద్య సేవలను వినియోగిం చుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, జడ్‌పిటిసి సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్, డిసిఎమ్ఎస్ మాజీ అధ్యక్షుడు కెవి.సత్యనారాయణ రెడ్డి, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, విక్టరీ సంస్థల అధినేత గొలుగూరి వెంకటరెడ్డి, మైగాపుల గురవయ్య నాయుడు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ప్రగతి నర్సింగ్ హోమ్‌లో వైద్యసేవలు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ బండారు

చలి కాలంలో కరెంటు బిల్లుల మంట

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఒక వైపు వణికిస్తున్న చలిలో కరెంటు బిల్లులు మంట మండుతోంది గత వారం రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు 20 నుంచి 21 డిగ్రీల సెల్సియస్ మధ్యలో నమోదవుతోంది. 15 రోజుల క్రితం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21.7 డిగ్రీల వరకు ఉండగా, వారం రోజుల్లో గణనీయంగా పడిపోయాయి. మరో వైపు ఉదయం వేళల్లో పొగ మంచు కమ్మేస్తోంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా నవంబరు మొదటి వారం నుంచే చలి పెరుగుతుంది. గడిచిన నెల రోజులల క్రమ క్రమంగా తీవ్రత పెరిగింది. సాయంత్రం వేళల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువైంది. మధ్యాహ్నం సమయంలో ఎండ ఉంటున్నా చలిగాలి కారణంగా వేడి ఉండటం లేదు. చలితోపాటు గాలులు వీస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఉబ్బసం, జలుబు, తదితర శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. చలిగాలులు వీస్తాయని, రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాబోయే రోజులలో చలి తీవ్రత మరింత చలిపెరిగే అవకాశం ఉంది. మరో వైపు చలికాలంలోనూ కరెంటు బిల్లులు అధికంగా రావటంతో వినియోగదారులలో ఆందోళన వ్యక్తమవుతోంది.

అందరి చూపూ ఎన్నికల వైపే

దశాబ్దకాలం తర్వాత ఎట్టకేలకు జరుగుతున్న సాగునీటి సంఘాల ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ప్రతిపక్ష వైసిపి ఇప్పటికే ఎన్నికలకు దూరంగా ఉన్నట్లు ప్రకటించిన నేపథ్యంలో అధికార పార్టీ అనుయాయులే చక్రం తిప్పే పరిస్థితులు నెలకొన్నాయి. అదే విధంగా ఈ నెల 17వ తేదీన జరిగే డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధిక మంది వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తున్న విషయం విదితమే. గత కొన్ని సంవత్సరాలుగా కాల్వల ఆధునీకరణను పాలక ప్రభుత్వాలు అటకెక్కించాయి. పూడికతీత పనులకు సైతం నోచుకోకపోవటంతో తుపానులు, అకాల వర్షాలకు పంట నష్టం జరగటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు నూతన కమిటీలు ఏ మేరకు కృషి చేస్తాయో వేచి చూడాల్సి ఉంది.

విద్యార్థులలో పరీక్షల ఫియర్

విద్యార్థులలో పరీక్షల ఫియర్ మొదలైంది. ఈ వారంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే విద్యాశాఖ షెడ్యూల్ ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు మొదలవుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయం విదితమే. మరో వైపు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రభుత్వం సంకల్ప్ నిర్వహించి పాస్ పర్సంటేజీ పెంపునకు చేస్తున్న కృషి ఏ మేరకు ఫలించనుందో వేచి చూడాల్సి ఉంది. పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో రెండేళ్లుగా జిల్లా పూర్తిగా వెనుకబడిన విషయం విదితమే. గత పరిస్థితుల నుంచి పాఠాలను తీసుకుని ఈసారైనా మెరుగైన ఫలితాల దిశగా అడుగులు వేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలలో పిడిఎఫ్ విజయకేతనం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికలలో పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపి మూర్తి విజయకేతనం ఎగుర వేయడంతో ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమైంది. ప్రత్యర్థి గంధం నారాయణరావుపై 3,906 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలుపును కైవసం చేసుకోవడం ఉపాధ్యాయ వర్గాల్లో పిడిఎఫ్ అభ్యర్థుల స్థానాన్ని మరోసారి గుర్తు చేసింది. ఉపాధ్యాయ సమస్యలతో పాటు అనేక ప్రజాసమస్యలపై శాసన మండలిలో పిడిఎఫ్ అభ్యర్థులు గళం విప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానం ఫలితంగా పాఠశాల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతున్న నేపథ్యంలో పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపుఆవశ్యకతను మరోసారి ఉపాధ్యాయులు గుర్తు చేశారు.

నేరాలు ఘోరాలు

యువకుని అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

బెంగుళూరు బేకరికి చెందిన యువకుడు అనుమానాస్పద మృతి పై బేకరి యజమాని చేసిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ఇవి.. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక మార్కెట్ ప్రాంతంలోని హైస్కూల్ ఎదురుగా ఉన్న బెంగుళూరు బేకరిలో పనిచేస్తున్న చేతన్ గౌడ్ (19) బేకరీ యజమనితో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాడు. అయిదే అతను నివసిస్తున్న ఇంటిలో ఈ నెల 13వ తేదీ రాత్రి యజమానితో కలిసి గౌడ్ నిద్రించాడు. శనివారం ఉదయం గౌడ్ ఎంతకీ నిద్ర లేవకపోవడంతో అతనిని బేకరీ యజమాని లేపేందుకు ప్రయత్నించాడు. అయితే గౌడ్ నిద్రలేకపోవడంతో అతనిని హుటా హుటిన ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి యువకుడు గౌడ్ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపాడు. దీనిపై బేకరీ యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వగా అనుమానాస్పద మతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.గౌడ్ మృతికి కారణాలు తెలియరాలేదు.

ఎంపీ ప్రకటనపై రైతుల హర్షం

ప్రజాశక్తి - తొండంగి

కొత్తగా నిర్మించే విమానాశ్రయాలు పంట పొలాల్లో ఉండకూడదని ఎంపీ తంగళ్ళ ఉదయ్ శ్రీనివాస్ చేసిన ప్రకటన పట్ల అన్నవరం, బెండపూడి రైతులు హర్షం ప్రకటించారు. శనివారం బెండపూడి హైస్కూల్ వద్ద అన్నవరం, బెండపూడి, చిన్నయ్య పాలెం రైతు సమాఖ్య కమిటీ సభ్యులు సమావేశం జరిగింది. బెండపూడి వద్ద ప్రతిపాదిత విమానాశ్రయ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సమక్షంలో ఎంపీ తంగళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పంట పొలాల్లో విమానాశ్రయాల నిర్మాణం సరికాదని చేసిన ప్రకటన తమకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని రైతులు అన్నారు. ఈ సందర్భంగా ఎంపి తంగెళ్ల చిత్రపటానికి రైతు సమాఖ్య సభ్యులు పాలా భిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

83 సాగునీటి వినియోగదారుల సంఘాల ఏర్పాటు

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో. పంటలకు సాగు, గ్రామాలకు తాగు నీటి విడుదలలో కీలకపాత్ర పోషించే 83 సాగునీటి వినియోగ దారుల సంఘాలు ఏర్పాటు కాబడ్డాయని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ప్రాదేశిక నియోజక వర్గాలకు, సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలను శాంతియుత, ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించినట్లు తెలిపారు. గోదావరి మధ్య డెల్టా గోదావరి తూర్పు డెల్టాలో మొత్తం 990 ప్రాదేశిక నియోజకవర్గాలకు గాను 983 ప్రాదేశిక నియోజక వర్గాలకు ఎన్నికలు నిర్వ హించడం జరిగిందని మిగిలిన ఏడు ప్రాదేశిక నియోజక వర్గాలలో ఓటర్లు లేని కారణంగా ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. తధనుగుణంగా 83 సాగునీటి వినియోగదా రుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించారన్నారు. సాగు నీటి సంఘాల ఎన్ని కలతో రైతులకు సకాలంలో సాగు నీరు ఇచ్చేలా పర్యవేక్షణ వ్యవస్థ గతంలో మాదిరిగా అందుబాటులోనికి వచ్చిందన్నారు. పంటలకు సాగు, గ్రామాలకు తాగు నీటి విడుదలలో కీలక పాత్ర పోషించే సాగునీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటు అయ్యాయన్నారు. సాగు నీటి సరఫరా కాలు వల నిర్వహణ ప్రక్రియ సజావుగా జరిగి కాలువ చివరి భూము లకు సాగునీరు నీరందించేలా పర్యవేక్షణ చేసేందుకు సాగు నీటి సంఘాలు దోహదం చేస్తాయన్నారు. అదే విధంగా ఇద్దరిని ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లుగా ఎన్నుకున్నారని అన్నా రు. వ్యవసాయం, రైతుల సంక్షేమం కోసం చివరి ఎకరం వరకూ సాగు నీరు సజావుగా పారే లక్ష్యంతో సాగునీటి సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం పున రుద్ధ రించిందన్నారు. ఈ నెల 17న డిస్ట్రిబ్యూషన్ కమిటీకు ఎన్నికలు నిర్వహిస్తారన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న జిసెస్ హోప్ ఛారిటీ ట్రస్ట్ సభ్యులు తదితరులు

ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రాజోలు

ఆపదలో ఆసరాగా బాధిత కుటుంబాలకు అండగా సమాజ సేవ చేస్తున్న జిసేస్ హోప్ ఛారిటీ ట్రస్ట్ సేవలు అభినందనీయమని శివకోడు గ్రామ సర్పంచ్ నక్కా రామారావు అన్నారు. శనివారం రాజోలు శివకోటి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ముత్యాల దత్తత్రేయ కుటుంబానికి జిసేస్ హోప్ ఛారిటి సమకూర్చిన రూ.10 వేలను, కిడ్ని పాడై డయాలసిస్ చేయించుకుంటున్న శివకోటి కోనవారి గ్రూపుకు చెందిన కోన విజయశేఖర్‌కు రూ.10 వేలను సర్పంచ్ రామారావు చేతులమీదుగా అందజేశారు.ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జిసేస్ హోప్ చారిటి ట్రస్ట్ ద్వారా పదేళ్లగా చేసతున్న సామజాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జాలెం శ్రీనివాస్, గెడ్డం బాలాశేఖర్ పలువురు పాల్గొన్నారు.



సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యనారాయణ కుటుంబానికి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు ఉప్పలగుప్తంకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చిక్కం సూర్యనారాయణ గురువారం మృతి చెందారు. ఆ కుటుంబాన్ని శనివారం పలువురు పరామర్శించారు. సూర్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన కుమారుడు జనసేన నాయకుడు సూర్య మోహన్‌ను, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, అమలాపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ అయితా బత్తుల సుభాషిణి, కూటమి నాయకులు కల్వ కొలను తాతాజీ, లింగోలు పండు, ఆకుల సూర్యనారాయణ మూర్తి,పెయ్యల దుర్గారావు, మధుర ప్రతాప్, వంగలపూడి నరసింహమూర్తి, చిక్కం ఉమేష్ తదితరులు ఉన్నారు.

కక్షిదారులకు న్యాయ అవగాహనా సదస్సు

మాట్లాడుతున్న రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలా రాణి

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు సీనియర్ సివిల్ జడ్జి,మండల న్యాయాధికార సంస్థ చైర్మన్ ప్రమీలా రాణి అన్నారు. స్థానికకోర్టు కాంప్లెక్స్ ఆవరణలో కక్షిదారులకు శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రాజోలు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయాధికార సంస్థ చైర్మన్ ప్రమీలా రాణి మాట్లాడుతూ రాజీయే రాజమార్గం అని అన్నారు. లోక్ అదాలత్‌లో ఒక్కసారి రాజీ చేసుకుంటే ఆకేసు ఏఇతర న్యాయ న్యాయ స్థానాల్లో అప్పీలు చేసినా చెల్లదు అని అన్నారు. అది రాజ శాసనం తో సమానం అని అన్నారు. అనంతరం జరిగిన న్యాయ అవగాహనా సదస్సులో 144 కేసులకు గాను రూ.97,68,838 ఆర్థిక లావాదేవీలు పరిష్కారం అయ్యాయని సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలా రాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు తెలిపారు. మొదటి బెంచ్ సభ్యులుగా సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలా రాణి, మాజీ ఎపిపి ఆచంట శ్రీనివాస్, రెండవ బెంచ్ సభ్యులుగా జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు, న్యాయవాది డిఎస్-ఎస్ఆర్ఎ శ్రీనివాస్ వ్యవహరించారు.

కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్‌లు దోహదం

ముమ్మిడివరం: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఎంతో దోహదం చేస్తాయని ముమ్మిడివరం మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జ్ మహమ్మద్ రహంతుల్లా అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ లో భాగంగా 175 కేసులు పరిష్కరించినట్లు వీటి ద్వారా మొత్తం రూ.56లక్షల17 వేల అపరాధ రుసుము వసూలు చేసినట్లు మేజిస్ట్రేట్ తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో ముమ్మిడివరం బారు అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి సత్యనారాయణ, ఎజిపి టి.శాంతి సుధ, అడ్వకేట్ గ్రంధి రామారావు, జి.శ్రీనివాసరావు, కె.సింహాద్రి వర్మ, ఆర్.మనీశ్వరరావు, ఎండి అలీ హసన్ తదితరులు పాల్గొన్నారు.

84 కేసుల పరిష్కారం

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరులో శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో ఆయన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో వివిధ రకాల 84 కేసులను ఆయన పరిష్కరించారు. వివిధ కేసులు ద్వారా వచ్చిన రూ.43.99 లక్షల కక్షిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కక్షిదారులు తమ కేసులో రాజీ పడటం వల్ల రెండు వర్గాలు ఆయా కేసులో గెలిచినట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జొన్నపల్లి సత్యనారాయణ, పిపి వి.శ్రీరాములు, బెంచ్ మెంబర్ కె.వి.వి.సాయిరామ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలమూరులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి ప్రవీణ్ కుమార్

ఘనంగా శక్తి పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జాతీయ శక్తి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం శనివారం ఎనర్జీ లిటరసీ సస్టైయినబుల్ ఫ్యూచర్ అనే అంశంపై వివిధ కార్యక్రమాలు చేపట్టింది. ఎనర్జీ లిటరసీ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్స్‌ను ప్రారంభించింది. స్వరాజ్ ఎనర్జీ ఫౌండేషన్ భాగస్వామ్యంతో మూడు గంటల వ్యవధి గల ఈ సర్టిఫికెట్ కోర్సు ద్వారా ప్రతి ఒక్కరూ శక్తి పరిరక్షణ అంశాలు వినియోగం సూచనలు తెలుసుకుంటారని ప్రతి ఒక్కరూ ఈ కోర్సులో చేరి శక్తి అక్షరాస్యులుగా మారాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ శక్తి పరిరక్షణ శాఖ పోర్టల్‌లో ఎనర్జీ కన్జర్వేషన్ ప్రతిజ్ఞ చేసి ధ్రువపత్రం పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు మొక్కను నాటి దానితో సెల్ఫీ దిగి సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని సూచించారు.

డ్రెయినేజీ నీటితో నిండిన వీధి

డ్రెయినేజీ నీటితో రోగాల వ్యాప్తి

ప్రజాశక్తి-కడియం

డ్రైన్లలో నీరు రోడ్లపై ప్రవహిస్తోందని, పిల్లాపాపలతో రోగాల బారిన పడుతున్నామని వేమగిరి కోకోకోలా ఫ్యాక్టరీ సమీపంలోని దేవి జనార్థన్ నగర్ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఇదే వీధిలో చిన్నారులు నిత్యం వెళ్లే అంగన్వాడీ కేంద్రం ఉందని, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలాగే ఉందని, కనీసం డ్రైన్లలో ఉన్న చెత్తను తొలగించడం లేదని, చిన్నపాటి వర్షం వస్తే చాలు ఈ వీధులు చెరువులను తలపిస్తున్నాయని, దోమలు విజంభించి దాడి చేయడంతో అనేక రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. ఎన్నికల్లో తప్ప ఏ ప్రజాప్రతినిధీ ఇటువైపు కన్నెత్తయినా చూడటం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామానికి సర్పంచ్ లేకపోవడం, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ ప్రత్యేకాధికారిగా వ్యవహరించడంతో సమస్యలను గుర్తించి పరిష్కరిస్తారని ఆశలతో ఉన్న తమకు నిరాశే ఎదురవుతోందన్నారు.

విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఉప విద్యా శాఖాధికారి

'పది'లో నూరు శాతం ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పదో తరగతిలో నూరు శాతం పలితాలు సాధించేందుకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని అయినాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టివి.కృష్ణారెడ్డికి అమలాపురం డివిజన్ జిల్లా ఉప విద్యా శాఖాధికారి జి.సూర్య ప్రకాశం సూచించారు. ముమ్మిడివరం మండలంలోని అయినాపురం జడ్‌పి ఉన్నత పాఠశాలను ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఆకస్మికంగా డివిజన్ జిల్లా ఉప విద్యా శాఖాధికారి జి.సూర్య ప్రకాశం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సెల్ఫ్ అసెస్మెంట్ టర్మ్ -1 పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆయన పదో తరగతి విద్యార్థులను ఇప్పటి వరకు జరిగిన సిలబస్ నుండి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం ప్రణాళికా బద్ధంగా శ్రమించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయుడిని నియమించాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ మూసివేతతో రోడ్డుపై భిక్షాటన చేస్తున్న కార్మికులు

జీడి పిక్కల కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గత 30 రోజులుగా మూసివేసిన చిన్నంపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ తెరిపించాలని కోరుతూ కార్మికులు నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా శనివారం ప్రత్తిపాడులో భిక్షాటన చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ అర్ధాంతరంగా జీడిపిక్కలు ఫ్యాక్టరీ మూసి వేయడంతో 24 గ్రామాలకు చెందిన 409 మంది కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారన్నారు. ఫ్యాక్టరీని మూసివేసిన నాటి నుంచి కార్మికులకు ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, అధికారులకు కార్మికుల గోడును వెళ్లబోసుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్మిక కుటుంబాల ఇబ్బందులను ప్రజలకు వివరించేందుకు కార్మికులు భిక్షాటనకు దిగాల్సి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఫ్యాక్టరీలు తీసుకు వచ్చి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పుకుంటున్నదని, మూసేసిన ఫ్యాక్టరీని తెరిపించి ఉపాధి కోల్పోయిన కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, బి ఆది, ఎం.కాంతారావు, రామదుర్గ, జయలక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజులపాటు పెద్దాపురంలో జరిగే సిపిఎం కాకినాడ జిల్లా 24వ మహాసభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సిరపరపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల విస్తృత స్థాయి సమావేశం లో ఆయన మాట్లాడారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. రోజు రోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధి అవకాశాలు తగ్గిపోతూ యువత నిరుద్యోగ సమస్యతో అవస్థలు పడుతుందన్నారు. ప్రజలను ఆదుకోవలసిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు, బడాకోటీశ్వరులకు ప్రభుత్వ రంగ సంస్థలను, వనరులను ధారాదత్తం చేస్తున్నాయన్నారు. ఇప్పటికే సరైన ఆదాయాలు లేక అవస్థలు పడుతున్న ప్రజలపై విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో భారాలు వేస్తుందన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమ వుతాయన్నారు. ఈ మహాసభలో 20న పుచ్చలపల్లి సుందరయ్య జీవిత విశేషాలతో ఫోటో ఎగ్జిబిషన్, కవితా సంకలను ఆవిష్కరణ, 21వ తేదీన బహిరంగసభ, 21, 22 తేదీల్లో ప్రతినిధుల సభ నిర్వహించబడుతుందన్నారు. ఈ సమావేశంలో నీలపాల సూరిబాబు, డి.సత్యనారాయణ, డి.కృష్ణ, కేదారి నాగు, అప్పన్న, సుబ్బలక్ష్మి, రాంబాబు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరం పాలెంలో ఉన్న ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమంత్ మండవ మాట్లాడుతూ మానవ శరీరంలోని కణాలు అస్థవ్యస్థంగా పెరిగిపోవడం వలన శరీరంలో కణితులు ఏర్పడతాయని అన్నారు. శరీరంలో కణితులు ఎక్కడ ఏర్పడిన ముందు జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ మాట్లా డుతూ క్యాన్సర్ మన శరీరంలో ఏ భాగానికైనా వచ్చే ప్రమాదం ఉందన్నారు. కళాశాల డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ వైకె.సుబ్బారావు మాట్లాడుతూ క్యాన్సర్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యాధి అని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. డీన్ కెరీర్ గైడెన్స్ డాక్టర్ డి.కిషోర్ మాట్లా డుతూ విద్యార్థులందరూ కాన్సర్‌పై అవగాహన కలిగి వుండి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సదస్సులో కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ చిట్టూరి రాంప్రసాద్, డాక్టర్ ఎం.రఘునాథ్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

ఫ్లెక్సీ ని ఏర్పాటు చేసిన పోలీసులు

బహిష్కరణలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

గ్రామ బహిష్కరణ, కుల బహిష్కరణలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. అరబిందో ఫా ర్మా కంపెనీకి అమ్ముడుపోయిన ఆ నలు గురు వ్యక్తులను కోనపాపపేట గ్రామ పెద్దలు గ్రామ బహిష్కరణ చేసి నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎస్ఐ గ్రామంలో గ్రామ, కుల బహిష్కరణలు నేరమంటూ కోనపాపపేట గ్రామంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మెగా డిఎస్‌సి శిక్షణా తరగతుల ప్రారంభం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని, అటువంటి రంగాన్ని ఎంచుకొని శిక్షణ పొందుతున్న డిఎస్‌సి అభ్యర్థులను రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. రాజమహేంద్రవరంలోని బిసి స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తున్న మెగా డిఎస్‌సి ఉచిత శిక్షణ తరగతులను మంత్రి కందుల దుర్గేష్ శనివారం ప్రారంభించారు. అన్ని రంగాల్లో ప్రతిభను ప్రదర్శిస్తున్న వెనుకబడిన తరగతుల కులాల విద్యార్థులు మరింత కష్టపడి చదివి భవిష్యత్తులో అద్భుతమైన ఉపాధ్యాయులుగా రాణించేందుకు ఇదొక సువర్ణ అవకాశమని, గొప్ప వేదిక అని మంత్రి పేర్కొన్నారు. బిసి స్టడీ సర్కిళ్లలో డిఎస్‌సికి అందిస్తున్న ఉచిత శిక్షణను బిసి అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్‌సి యాక్షన్ ప్లాన్‌లా త్వరలోనే బిసి యాక్షన్ ప్లాన్ తీసుకొస్తామని తద్వారా అవకాశాలను మరింత మెరుగు పరుస్తామని, అందుకు కూటమి ప్రభుత్వం కత నిశ్చయంతో ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో డిఎస్‌సి అభ్యర్థులకు నిరాశ మిగిల్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 16 వేల పైచిలుకు పోస్టులతో మెగా డిఎస్‌సి ప్రకటించిందన్నారు. అంతేగాక భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా రాణించేందుకు శిక్షణ ఇచ్చేలా స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేసిందన్నారు. అభ్యర్థులు కష్టం, ప్రతిభను నమ్ముకుని ముందుకు వెళ్తే కూటమి ప్రభుత్వం నూటికి నూరు శాతం చేయూతనిస్తుందనిహామీ ఇచ్చారు. కష్టపడి చదివి డిఎస్‌సి సాధించి ఉపాధ్యాయులుగా రాణించాలని అభ్యర్థులకు సూచించారు. విజయానికి షార్ట్ కట్ అంటూ ఏమీ ఉండదని కష్టపడి చదవడమే విజయానికి ఏకైక మార్గమని ప్రేరేపించారు. 90 శాతం కష్టం, 10 శాతం అదృష్టం కలిసి వస్తే విజయం వరిస్తుందన్నారు. డిఎస్‌సి ఉచిత శిక్షణ తరగతులు 12 ఫిబ్రవరి 2025 వరకూ కొనసాగుతాయని తెలిపారు. పోటీతత్వంతో విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు స్టడీ సర్కిల్స్ వేదికగా నిలుస్తాయన్నారు. కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ ఉండదని, బాగా చదివి కన్నవారికి పేరు తీసుకురావాలని అభ్యర్థులకు మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. 14 ప్రదేశాల్లో బిసి, ఎస్‌సి హాస్టల్స్‌లో సిఎస్ఆర్ ఫండ్ ద్వారా నిధులు వినియోగించి మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్న కలెక్టర్ ప్రశాంతిని మంత్రి దుర్గేష్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ సంఖ్యకు కారణమైన అంశాన్ని గుర్తించి సంబంధిత సౌకర్యాల కల్పనకు కలెక్టర్ కృషి చేస్తున్న తీరుపై హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే ఎస్‌సి, బిసి హాస్టల్స్ మెరుగైన వసతులు కల్పించే దిశగా కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, పోటీ పరీక్షలలో విజయం సాధించడంలో సబ్జెక్టుపై అవగాహన, చిత్తశుద్ధి, దఢ సంకల్పం ఉండాలన్నారు. బిసి స్టడీ సర్కిల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం సిఎస్ఆర్ కార్యకలాపాల కింద పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మెగా డిఎస్‌సి స్క్రీనింగ్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఉచిత శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇందుకోసం 220 మందికి ఇక్కడ శిక్షణా కార్యక్రమాలను అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి స్ఫూర్తి పెంపొందించేలా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఆర్ట్స్ కళాశాలలో ఉన్న గ్రంథాలయం ఉస్మానియా తదితర విశ్వ విద్యాలయాలకు సరిసమానంగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శిక్షణా తరగతులకు హాజరయ్యే అభ్యర్థులకు ఆ గ్రంథాలయం పుస్తకాలు అందుబాటులో తీసుకుని రానున్నట్లు కలెక్టర్ తెలిపారు. సరైన మార్గ దర్శనం ఉంటే పోటీ పరీక్షలలో విజయం సాధించడం సులభం అవుతుందన్నారు. సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూట మి ప్రభుత్వానికి విద్యా ప్రమాణాలను పెంచే చిత్త శుద్ధి ఉందన్నారు. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డిఎ స్‌సి ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఆర్.కృష్ణ నాయక్, బిసి స్టడీ సర్కిల్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎఎన్.జ్యోతి, బిసి సంక్షేమ అధికారి పిఎం.రమేష్, సీనియర్ ఫ్యాకల్టీ సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

డాక్యుమెంటు పడిపోయినది

పల్నాటి సుభద్ర w/o లేట్ త్రిమూర్తులు D.no 6-2-25/3, గాంధీనగర్,అమలాపురం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నివాసి అయిన నేను **ది.10-11-2024**వ తేదీన అమలాపురం గాంధీనగర్ నుండి గడియార స్తంభం సెంటర్ కు నా భర్త లేట్ త్రిమూర్తులుకు చెందిన గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ డాక్యుమెంట్ అమలాపురం సబ్ రిజిష్టర్ ఆఫీసులో రిజిష్టర్ కాబడిన గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ డాక్యుమెంటు **నెం.302/2005** ను జిరాక్స్ తీసుకొనుటకు తీసుకుని వెళ్ళుచుండగా మార్గమధ్యలో జారి పడిపోయినది. ఎంత వెతికినా సదరు డాక్యుమెంటు దొరకలేదు.దొరికిన వారు ఈ అడ్రస్ కు అందజేయగలరు.

పల్నాటి సుభద్ర
W/o. లేట్ త్రిమూర్తులు, డో.నెం. 6-2-25/3, గాంధీనగర్, అమలాపురం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్:9701587773